కథా నిలయం
3672
శ్రీకాకుళం

# మునిగోరింట

ఊళ్ళో, అన్ని మిద్దెలుండగా మేడలుండగా,- ఉదయించే సూర్యభగవాన్లు శకునపక్షి కిమల్లే, - సీతాయి ఈతాకుల గుడిసెలోనే తొంగిచూస్తాడు-

తిన్నా పస్తున్నా - ఊరు మాటుమణిగే వేళకన్నా, అమ్మకన్న పుణ్యాన, ఓకునుకుపట్టుతుంది - ఆ ఊరూనాడూ, మదలే వేకువజాముకు, గడియో అరగడియో ఆదమరచే నిదుర కమ్ముకుంటుంది - అంతలో సూరయ్యా చురచురలాడు కుంటూ మారాం చేస్తాడు-

నిదుర లేచి మాత్రం ఏమిటి చేసేది - చేలకోతకు, కుప్పనూర్పుళ్ళకూ పోయి,-ఆ యిచ్చే అర్ధరూపాయి డబ్బుల కోసం, పాచిమాటలు పడుతుందా?-పస్తుంటే నేం?

చేజ్జాపి చాకిరీ చేయించుకోండమ్మా అని, ఏతల్లినన్నా అడిగినా–మా ఆయన అసలే మంచివాడు కాడు – అందుకు తోడు నీవొక తెవు దాపురించావా అంటే;–ఇక నా కాపురం –

ఆ పై పొల్లుమాట అనిపించుకోకుండానే వచ్చేస్తుంది– ఓపిక తెచ్చుకుని వస్తుంటుంది.

ఊళ్లో కోరమీసం ఉన్నవాడూ పీడూ, – ఒంటరిగా చూసి, ఒక్క–నవ్వు నవ్వుతాడు – తలవంచుకుని పోతూంటే దారికి అడ్డమౌతాడు – 'అదేమిటి అన్నా!' అంటే, అక్కసు తెచ్చుకుని, – 'ఆసినీ–' బూతుకూత కూస్తాడు–

అయ్యతో చెప్పుకుంటే మాత్రం —— 'నన్నిలా ఈ మాయదారివాడు తూలుమాట అన్నాడయ్యా!–' అని మొత్తుకుంటే మాత్రం – నలుగురి పాదాలదగ్గిరా బ్రతికే బడుగు – ఏం ఆదుకుంటాడు – ఏనాడో చల్లగా వెళ్ళిపోయిన అమ్మకు బూతులు తగిలినాయంటే – అయ్యగుండె పీక్కు–పోదూ ?–

ఈ పున్నమికి రెణ్ణెల్లు దాటుతాయి: కట్టుకున్న మగడు – అెక్క–డకో – దండులో పోయి కలశాడు – కాకిచేత కబురంపనా అన్నాడు – రూకలన్నాడు; కోకలన్నాడు – ముప్పొద్దులూ వెచ్చటి బువ్వన్నాడు – దోసెడుసొమ్ము అనుపుతా నన్నాడు: పోయిన జాడన్నా తెలియకుండా పోయినాడు–

అయ్యకు, ఆ పెద్దలోగిలివారు, ముప్పొద్దులూ బువ్వ పెట్టి మూడురూపాయలు విసుక్కుంటూ మొగాన కొడ

తారు - నెల తిరిగేసరికల్లా, ఓ పదిపొద్దులు అటూ ఇటూ అయినా - మారాజులు; రోజులు ఆనాటి కానాడు మరీ మండిపోతున్నాయి - నెలకు ముప్పైరోజులూ - ఆ ముచ్చిక మూడూ కడుక్కు- గొంతులో పోసుకున్నా - కడుపులోకి చుక్క- దిగదు - ఇలానే బ్రతకాలి - కట్టుకున్న మొగాడికి,- అక్కడ కాలూ చెయ్యీ ఆడేదాకా—

ఎవడో, - ప్రొద్దు మాపటివేళ, - మంచి సిమా జామా వేసుకుని, - అచ్చంగా దొరదిగినట్టు దిగాడు-

'ఏం తాతా- సీతాయ్ ఏద'న్నాడు-

కుక్కిలో, నడుంవాల్చి కునుకుతూన్న అయ్య, రోషం తెచ్చుకుని,-

'ఏం - దానితో నీకేం పనయ్యా!' అని కరవొచ్చి నట్టు లేచాడు-

'పండుగో తాతా! - నేను పటాలంలోంచి వచ్చాను- సీతాయ్ నీకూతురే కాదూ? - ఊరిలో వాకబుచేస్తే - యిదే యిల్లన్నారు - మీ అల్లుడంపాడయ్యా!-' అంటూ మంచంపట్టెమీద కూర్చున్నాడు-

సీతాయ్‌కి ప్రాణం లేచివచ్చింది - వచ్చి వ్రాలి, - 'నేనే అన్నా! - ఆయన బాగున్నారా!-' అని అడిగి తల వంచుకుని సంబరంతో కంటతడిపెట్టింది-

'ఓ - ఒంటికి కండొచ్చింది! - ఒకటికి రెండైనాడు - ఆ దిరేసుమీద నీవు పోల్చుకోనేలేవు-!'

పై జేబులోంచి బొమ్మతీసి అందిచ్చాడు; ఆ బారు బారూ, - నలకలంటి మనుష్యులు - అందరికీ, - అచ్చుపోసినట్టు ఒక్కటే - ఒక్క మొయినే చుట్టుకోవడం - కట్టుకోవడం- అందులో ఏ మొగమో - కంటితో వెదకొచ్చుగాని, - చేయి మరోడిమీద పడితే - మచ్చకాదూ ?-

'అంతుచిక్కలా అన్నా ! - అక్కడ చల్లగా ఉంటే చాలు !-' అని లోపలికిపోయి, చిటికెలో వచ్చిన బందువుకు వండి వార్చింది.

వచ్చిన వీరయ్యా - ఆ రేయి ఉన్నాడు - కాదుకూడదని బలవంతం పడితే - ఆనాడూ ఉండిపోయినాడు - ఉన్నంతసేపూ అక్కడి ఊసులన్నీ పూసగుచ్చినట్టు చెప్పాడు - కోడి కూసే వేళకు లేచి, - తెచ్చినసొమ్ము యిచ్చి - పయనమై పోయినాడు, కూనా గుడ్డూ ఉన్నఊరికి-

ఆ వచ్చినయ్య అటు మళ్ళాడో లేదో - మనిషి విడిచి మనిషి, వేలువంచి చూపేవాడే - ఊరూనాడూ ఏకమై, సీతాయిని ఆడిపోసుకునేవారే !-

ఆ వచ్చిన మనిషి ఎవరు ? - అక్కడ ఆయనతో బాటే కొలువుచేసేవాడంటే - నమ్మరు.

వచ్చి నీ కేమిచ్చి పోయినా డంటారు. గింజలట్టు కెళ్లేందుకూ మార్చే రూకరూకకూ మచ్చ కడతారు - పుచ్చుకు నవ్వుకుంటారు !-

ఆనాటి కానాడు మరి బరిమీరిపోయినారు- 'తాతా మనవణ్ణి ఎత్తుతావుటే !' అంటారు. అయ్యా తన్నేమీ పొల్లు

మాట అనేవాడుకాడు. అన్నీ విని తనలో తానే గుండె బాదు కున్నాడు–అలాగే మంచం పట్టాడు—

అయ్యా నా తప్పు లేదయ్యా– అని ఆ ఊసెత్తేందుకే గుండె చాలకపోయింది: 'నా మొగవాడు కట్టుకున్న పున్నమే. ఇది! నన్ను ఆడిపోసుకుంటే మీకు కళ్లు ఉంటాయా!' అని మనసులో అనుకునేందుకన్నా చీదరే– ఊరు, నిందమోపితే– అన్న అంకిలే నొక్కుకుపోతుంది– పుస్తె కట్టినవాడు నమ్ముతాడా?–

నమ్మడనుకుంటే–(బతికేదే కాదేమో–

వచ్చేవాడు రానే వచ్చాడు– యీ (పొద్దుకు (వాలు తానని కమ్మ అంపాడు– అందులో చెప్పిన జాముకే– ఆ బొమ్మలో ఉన్నట్టే వచ్చాడు–

వచ్చేవాడు ఊరిమీద ఏం విన్నాడో– ఎంత నమ్మాడో– ఎదురుపడగానే ఎగిరి తన్నపోయినాడు, దొరల్లే అరచాడు–

'అదేం పాపం ఎరగదయా!' అని అయ్య అంటూండ గానే– ఆమీదకు ఉరికాడు– ఇరుగయ్యా పొరుగయ్యా చేరి, ఆ మారాజునే ఆకట్టుకున్నారుగాని– అదేమి పుణ్యమయ్యా! ఆడకూతురిమీదికి ఒంటికాలుమీద లేస్తావెందుకూ– సీతాయి మా బిడ్డవంటిదికాదూ' అని బిడ్డలున్న సంసారులు ఆగడ్డ మీద యిందరున్నారే, ఒక్కరికైనా పెదవులు మెదిలి నాయా?– అదన్నైందికదా అని,– అందరూ తలో అడ్డుపడకా

విరిచారు. తనెన్నడన్నా కీడు తలంచిందా,- ఆ అయ్య లందరికీ !-

కాపురం చేసినన్ని పొద్దులూ, కడుపుకు ఉన్నా మానినా,- ఎన్నడూ కన్నెర్రచేయనివాడికి - ఈ కర్మ మేమిటి?- సీమా-జామా మార్చుకోంగానే- మనసూ మారి పోతుందా ? - ఒంటిపొద్దులు మాని. వల్లమాలినంత బువ్వ కంటికి అందగానే-మనకేసుకుపోతుందా ? - దండులో ఉన్న పెద్దలు చెప్పే బుద్ధులు ఇవేనా?-

'అయ్యా మీకు మా ఉసే పట్టిందా నాయనా! - బడలివచ్చిన మొగవాడికి - కళ్ళు బైర్లు కమ్మాయి - నేను కాచుకుంటాను - మీ యిళ్ళకు మీరు పొండయ్యా దొరలు- నేను మప్పుకుంటాను-' అంటూ జోడు కేలెత్తి బతిమలాడు కుంది. అందరినీ సాగనంపింది.

'అయ్యా వచ్చిన వాడేమో, ఊరంతా పొక్కిందీ!- నీ అల్లుడూ నేనూ మాట తేల్చుకుంటాము - నీవు కునక వయ్యా!-' అని అయ్య నోరెత్తకుండా చేసింది.

'అయ్యా అమ్మా నెయ్యేళ్ళూ మాట వంకర పోకుండా, - ఈ నీడలో బతికారు - ఇక్కడెందుకు, యోగీ!- పచ్చని చేలగట్టున - పైరు ముట్టి నిజం ఎరుక చెప్తాను - రా-' అని, పసికూన అడిగినట్టు అడిగింది-

'ఒంటరిగా పోయి మళ్ళీ బ్రతికివస్తావా కూనా -' అని అయ్య విలవిలలాడిపోతున్నాడు.

'మాకు వెయ్యేళ్ళ ఆయుస్సుంది అయ్యా – నావాడు నా వెంటనే ఉన్నాడుగా !–' అని వెన్ను చరిచింది–

పచ్చని చేనుగట్టున పండు వెన్నెల్లో మగవాణ్ణి నిలవేసింది–

'నీ పాదాలసాక్షిగా నే నేం నేరం జేశానయ్యా !– నీవు నమ్మాలయ్యా ! – కడుపుంలో కూనకు అయ్య నీవు కాదంటావా ? – నీ బిడ్డకు మారుతండ్రిని కట్టుకున్నా ననుకున్నావా ? – నేను, ఆ తల్లి కడుపున పుట్టలేదనుకున్నావా?–' కత్తినూరినట్టు, కన్నెత్తి మనవి చేసుకుంది–

'వచ్చినవాడు – అది మరగినవాడు ఊరికే చూసిపోతే, – ఊరు చెప్పుకుంటుందా ఒప్పుకుంటే యీ తప్పు కాస్తాను : వల్లకపోయినా కూడూ గుడ్డా యిస్తాను–'

'ఈ బిడ్డ ఎవరిసొమ్మంటావు ! – నీ విచ్చిన వరం కాదా ?–'

'పాపం పుణ్యాం భగవంతుడికే విడుస్తాను – నీమీద చెయి చేసుకోనులే – నీ బ్రతుకు ఏదో నీవు బ్రతుకు–'

'నిన్ను విడిచా ?'

'నేనే పోతున్నానుగా !–'

'పొట్టకు లేక పోయినావుగాని–'

'ఒట్టుకూ సత్యానికీ అయినా, రానులే – నా ఊసు మరచిపో–'

'నీ కూనకు అయ్య–'

'ఆమాట ఎత్తకు – నన్ను కవ్వించక నీదోవ నీదే అంటినిగా–'

'అదే మాటా ?'

'అహాఁ !– ముమ్మాటికీ !–'

'నన్ను కవ్వించకే !–'

'నవ్వుతూనే అడుగుతున్నానుగా–'

'నవ్వెందుకు – నన్ను చూశా – చేసిన తప్పు కాశాననా ?–'

'మళ్ళీ అదేమాటా ?–'

'ఈ జన్మకు యింతేనా !'

'ఇంతేనా ?– అయితే ఈ జన్మ ఇంకెందుకూ ?–'

మిడినాగు ఎగిరినట్టు బెడిసి,– కంఠం కట్టేసింది – కుమ్మి కూలదోసింది – 'కట్టుకున్నదానికి మారుమనువు కట్టావా ?– బిడ్డతండ్రికి మారుపేరు పెట్టావా ?– ఆమాట కంఠంలోనే అదిమేస్తాను–' అంటూ– అన్న ఊపిరంతా నొక్కేసింది–

అప్పుడా మొగంకేసి చూసింది-ఒక్కటే చూపు-నవ్వినట్టుంది ఆమొగం– ఆ కళ్ళు చిన్నచూపు చూడటంలేదు – కల్లాకపటం, రోషం కావేషం దూసుకుపోయిన ఆ గుండెమీద తల ఆన్చుకుని, ఉసురుకు ఉసురు తోడిచ్చింది–

తెల్లవారింది– ఆ యీతాకుల గుడిసెలోకి సూరన్న తొంగిచూచాడు – సీతాయ్ ఏదీ అని తొంగిచూచాడు. మిన్నెక్కాడు–